‘పోడు’ సమస్యలను పరిష్కరిస్తా

ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే మండలంలోని రుక్మాపూర్ పోడు భూముల సమస్యలను పరిష్కరిస్తానని దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి హామీ ఇచ్చారు. గురువారం మండలంలోని బోనాల్, కిష్టాపూర్, ఇబ్రహీంపూర్, రుక్మాపూర్ గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రుక్మాపూర్‌లోని రైతులు తమ పోడు భూముల పట్టాలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ఎంపీని కోరారు. ఇబ్రహీంపూర్‌లో పోడు భూముల సమస్యలు పరిష్కరించినట్లు బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే ఎమ్మెల్యేగా రుక్మాపూర్ పోడుభూముల సమస్యలను కూడా పరిష్కరిస్తానని పేర్కొన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో రఘునందన్‌రావుతో అభివృద్ధి జరగదని అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్‌తోనే అది సాధ్యమవుతుందని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్నాటకలో అమలు కాని సంక్షేమం తెలంగాణలో ఎలా అమలు అవుతుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే రాష్ట్రంలో కరెంటు కష్టాలు వస్తాయని, మూడు గంటల కరెంటు అందించే కాంగ్రెస్ కావాలా 24 గంటల కరెంటు అందించే బీఆర్‌ఎస్ ప్రభుత్వం రావాలా అని రైతులు నిర్ణయించుకోవాలని సూచించారు. బీఆర్‌ఎస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న తనను గెలిపిస్తే నియోజకవర్గంలోనే ఉండి ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మాసుల శ్రీనివాస్, జెడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మంచికట్ల శ్రీనివాస్, సర్పంచ్‌లు మల్లయ్య, రాములు, స్వప్న, శ్రీనివాస్, బాలనర్సు, ఎంపీటీసీలు శ్రీనివాస్, గణేష్, నాయకులు రాజిరెడ్డి, నారాయణరెడ్డి, ప్రవీణ్‌కుమార్, జింకశ్రీనివాస్, విశ్వేశ్వర్‌రావుతో పాటు పలు గ్రామాల బీఆర్‌ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



బోనాల్ గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

మురళీ యాదవ్‌ను మార్చాలి

- లేకపోతే మరొకరిని పోటీలో పెడతాం
- పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోపి



సమావేశంలో మాట్లాడుతున్న గోపి

నర్సాపూర్: నర్సాపూర్ బీజేపీ అభ్యర్థి మురళీయాదవ్‌ను మార్చాలని లేనిపక్షంలో తాము మరో బీసీ ని పోటీలో నిలబెడతామని బీజేపీ నాయకులు హెచ్చరించారు. గురువారం నర్సాపూర్‌లోని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మల్లేష్‌గౌడ్ ఇంటిలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో పార్టీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు సింగాయిపల్లి గోపి మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీలో పనిచేసిన కొందరు బీజేపీలోకి వచ్చారని, వారు తమ సొంత భావాలు అమలు చేస్తున్నారని ఆరోపించారు. దీంతో ఎంతో కాలంగా పార్టీ కోసం పనిచేస్తున్న నాయకుల మనోభావాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నర్సాపూర్ నియోజకవర్గంలో చాలా మంది నాయకులకు తీవ్ర నష్టం కలుగుతోందని గోపి ఆవేదన వ్యక్తం చేశారు. తన తండ్రి రాంచందర్‌రావుపై నక్సలైట్లు దాడి చేసినా తాము బీజేపీని విడిచిపెట్టలేదని ఆయన గుర్తుచేశారు. పలువురు నాయకుల ఆస్తులను ధ్వంసం చేసిన మురళీయాదవ్‌ను పార్టీ అభ్యర్థిగా ప్రకటించడాన్ని తాము ఖండిస్తున్నామని, అభ్యర్థి ఎంపిక విషయంలో అధిష్టానం పునరాలోచించాలని, అభ్యర్థిని మార్చని పక్షంలో తాము మద్దతు ఇవ్వబోమని స్పష్టం చేశారు. సమావేశంలో మల్లేష్‌గౌడ్, రఘువీరారెడ్డి, రవిగౌడ్ తదితరులు మాట్లాడుతూ నర్సాపూర్ అభ్యర్థిని మార్చాలని తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌లోకి జోరుగా వలసలు



కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు

రేగోడ్(మెదక్): మండలంలోని ఆయా గ్రామాల్లో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వలసలు జోరుగా కొనసాగుతున్నాయి. గురువారం ఆర్.ఇటిక్యాల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ యూత్ మండల మాజీ అధ్యక్షుడు చాకలి లక్ష్మణ్, గ్రామ అధ్యక్షుడు అంజయ్య, మాజీ అధ్యక్షుడు వడ్ల శివకుమార్‌తో పాటు 35 మంది, బీజేపీ గ్రామ ఉపాధ్యక్షుడు సంగమేశ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారితో పాటు మరో ఐదుగురు ఉద్యమకారులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్. దిగంబర్‌రావ్ తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీలో ఉద్యమకారులకు ప్రాధాన్యం లేదని కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు చాకలి లక్ష్మణ్ ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్, జెడ్పీటీసీ యాదగిరి, మాజీ జెడ్పీటీసీ రాజేందర్ పాటిల్, కోఆప్షన్ సభ్యుడు చోటూమియా, ఆర్.ఇటిక్యాల అధ్యక్షుడు ఈశ్వరప్ప, నాయకులు వెంకటరావు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

అధికార పార్టీకి తలనొప్పిగా సంక్షేమ పథకాలు

- ప్రచారాన్ని అడ్డుకుంటున్న జనం
- మొన్న మెదక్.. నేడు మనోహరాబాద్‌లో..



వెంకటపూర్ గ్రామంలో జెడ్పీ వైస్‌చైర్మన్ లావణ్యరెడ్డికి అడ్డుకున్న గ్రామస్తులు

మెదక్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయనే ధీమాతో ఉన్న అధికార పార్టీ నాయకులకు అవే తలనొప్పిగా మారాయి. ప్రధానంగా దళితబంధు, బీసీ బంధులాంటి పథకాలు పాలక పక్షానికి ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయి. ఈ నెల 11న మెదక్ మండల పరిధిలోని వెంకటపూర్ గ్రామంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు సమావేశం ఏర్పాటు చేయగా, ముఖ్య అతిథిగా జెడ్పీవైస్ చైర్మన్ లావణ్యరెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతుండగా దళితులు అక్కడికి చేరి నిరసన తెలిపారు. తమ గ్రామంలో దళిత బంధు, గృహలక్ష్మి, బీసీబంధు పథకాలను ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. గ్రామంలో ఎక్కువ మంది దళితులే ఉన్నారని, ఒక్కరికి కూడా దళిత బంధు మంజూరు చేయలేదని మండిపడ్డారు.

మనోహరాబాద్‌లో..

గురువారం మనోహరాబాద్ మండలం వెంకటాపూర్ అగ్రహారం గ్రామానికి జెడ్పీచైర్మన్ హేమలత, శేఖర్‌గౌడ్‌తో పాటు పలువురు అధికార పార్టీ నాయకులు ప్రచారానికి వెళ్లారు. గ్రామంలోని దళితవాడకు వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరగా తమ గ్రామానికి దళితబంధు రాలేదని ఓటు వేయలేమని ఖరాకండిగా చెప్పారు. అదే గ్రామంలోని ముదిరాజ్ వీధికి వెళ్లి ఓట్లు అడుగుతుండగా తాము ఈ సారి అధికార పార్టీకి ఓటు వేయలేమని, ఈటల రాజేందర్‌కు మాత్రమే వేస్తామంటూ ప్రజలు చెప్పారు. నిరసన వ్యక్తం చేశారు. పాపన్నపేట మండలం ధాక్యాతండా ప్రజలు ఏంచేసి ఓటు అడుగుతున్నారంటూ ప్రశ్నించారు.

సునీతారెడ్డికి శుభాకాంక్షల వెల్లువ



సునీతారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నర్సాపూర్ నాయకులు

నర్సాపూర్: బీఆర్‌ఎస్ అభ్యర్థిగా సునీతారెడ్డిని ఖరారు చేసినప్పటి నుంచి ఆమెకు పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. బుధవారం సీఎం కేసీఆర్ నర్సాపూర్ అభ్యర్థిగా సునీతారెడ్డిని ప్రకటించి ఆమెకు మంత్రి హరీశ్‌రావు, స్థానిక ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సమక్షంలో బీ ఫారమ్ అందజేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి నియోజకవర్గంలోని కొందరు పార్టీ నాయకులు ఆమెకు ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలియచేస్తుండగా కొంత మంది నాయకులు హైద్రాబాద్‌లోని సునీతారెడ్డి ఇంటికి వెళ్లి ఆమెను శాలువాలతో సన్మానించి పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలుపుతున్నారు. కాగా నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్‌తో పాటు మండలంలోని పలువురు నాయకులు గురువారం సన్మానించి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజా సంక్షేమం కోరేది కాంగ్రెస్ పార్టీనే..

పార్టీ నాయకురాలు త్రిష



శ్రీనివాస్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న త్రిష

టేక్మాల్(మెదక్): ప్రజా సంక్షేమాన్ని కోరుకునేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ కుమార్తె ఆ పార్టీ నాయకురాలు త్రిష అన్నారు. గురువారం మండలంలోని పలు తాండాల్లో ఆమె పార్టీ తరుపున ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన మేనిఫెస్టోను ప్రజలకు వివరించి, పార్టీకి ఓటు వేసి గెలింపిచాలని కోరారు.

ఎస్టీసెల్ మండల కార్యదర్శిగా శ్రీనివాస్

కాంగ్రెస్ పార్టీ ఎస్టీసెల్ మండల ప్రధాన కార్యదర్శిగా మండలంలోని కాద్లూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయనకు త్రిష నియామక పత్రాన్ని అందజేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ రమేష్, కాంగ్రెస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు సంగమేశ్వర్‌గౌడ్, మండల కో–ఆప్షన్ సభ్యుడు మజహర్, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు మహేష్‌రెడ్డి ఆయా గ్రామాల నాయకులు, యువకులు పాల్గొన్నారు.

డబ్బులివ్వలేదని విద్యార్థి ఆత్మహత్యాయత్నం

వెల్దుర్తి(తూప్రాన్): తన అవసరాలకు తల్లి డబ్బులు ఇవ్వలేదనే కోపంతో ఒక బాలుడు రైలుకింద పడి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గురువారం మాసాయిపేటలో ఈ ఘటన జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పోతిన్‌పల్లి యాదమ్మ, అంజయ్య చిన్న కుమారుడు సాయి స్థానిక ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. గురువారం ఉదయం ఖర్చుల కోసం రూ.100 ఇవ్వాలంటూ తన తల్లిని అడిగాడు. తన వద్ద లేకపోవడంతో తరువాత ఇస్తానని చెప్పింది. దీంతో ఆత్మహత్య చేసుకుంటానంటూ ఇంటి నుంచి బయటకు పరుగు తీశాడు. రైలు పట్టాలపై చేరుకుని రైలుకు ఎదురుగా వెళ్ళి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించగా అతడి వెనకాలే వచ్చిన తల్లి యాదమ్మ కేకలువిని దగ్గరో ఉన్న ఒక యువకుడు సాయిని రక్షించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు విద్యార్థి, కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ ఇచ్చారు.

రాష్ట్రంలో ప్రత్యామ్నాయం బీజేపీయే



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

హవేళిఘణాపూర్(మెదక్): రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీ బీజేపీయేనని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు పంజా విజయ్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన హవేళిఘణాపూర్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గతంలో ఇచ్చిన దళితబంధు, గృహలక్ష్మి లాంటి పథకాలను ప్రవేశపెట్టకుండా ప్రజలకు ఆశపెట్టి ఓట్లు దండుకోవాలని చూస్తున్నారన్నారు. కర్ణాటకలో ఇచ్చిన హామీలను నెరవేర్చని కాంగ్రెస్ తెలంగాణలో ఎలా పాలిస్తుందని ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి పట్టంకట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు శ్రీపాల్, పార్టీ మండల అధ్యక్షుడు రంజిత్, శ్రీనివాస్, శ్యాంసుందర్, కుమార్, అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీ.. ఒకరి మృతి

కౌడిపల్లి(నర్సాపూర్): కారు, బైక్ ఢీ కొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన కౌడిపల్లిలో గురువారం జరిగింది. స్థానిక ఎస్ఐ శివప్రసాద్‌రెడ్డి, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కౌడిపల్లి మండలంలోని భుజిరంపేట పంచాయతీ పరిధిలోని ఎర్రమట్టితండాకు చెందిన కాట్రోత్ సామ్య(54), హత్నూర మండలం సిరిపురం తండాకు చెందిన తన అల్లుడు మాలోత్ రాజు బైక్‌పై ఎర్రమట్టితండా నుంచి కౌడిపల్లికి వచ్చారు. పీహెచ్‌సీ ముందు జాతీయ రహదారిపై యూటర్న్ తీసుకుంటున్న సమయంలో మెదక్ వైపు నుంచి హైదరాబాద్ వెళుతున్న మల్కాజ్‌గిరికి చెందిన చంద్రరాజు తన కారుతో బైక్‌ను ఢీ కొట్టా డు. పోలీసులు అక్కడికి చేరి క్షతగాత్రులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాట్రోత్ సామ్య అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అతడి కొడుకు లాల్యా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

చేగుంట(తూప్రాన్): గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కర్నాల్‌పల్లి శివారులో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కర్నాల్‌పల్లిలో గురువారం హకీంపేట్ గ్రామానికి చెందిన నాగభూషణం(58) కర్నాల్‌పల్లిలో జరిగే ఓ శుభకార్యానికి హాజరయ్యాడు. ఈ క్రమంలో తన ద్విచక్ర వాహనంతో అక్కడ ఆగిన అతడిని చేగుంట వైపువెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో నాగభూషణం అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరి కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పోలీస్ విధులపై చిన్నారులకు అవగాహన

- పోలీస్ స్టేషన్‌లలో ఓపెన్‌హౌస్ కార్యక్రమాలు



చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మధుసూదన్‌గౌడ్

మెదక్ మున్సిపాలిటీ: విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌లలో ఓపెన్ హౌస్ కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో పోలీస్ ఫ్లాగ్ డే నిర్వహించారు. సుమారు 1,000 విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులకు ఫ్రెండ్లీ పోలిసింగ్ విధానం, డే/నైట్ బీట్స్, పెట్రోలింగ్ వ్యవస్థలు, పోలీసు శాఖ నేరస్తులను సులువుగా గుర్తించడం, పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్ వంటి నూతన సాంకేతికతల గురించి వివరించారు. పోలీస్ శాఖ ఉపయోగించే ఆయుధాలు, వాటి పనితీరు, ఏ సందర్భాలలో ఉపయోగపడతాయని తెలిపారు. ట్రాఫిక్ రూల్స్, డ్రంక్ అండ్ డ్రైవ్, స్పీడ్ గన్ వినియోగం, బాడీ ఓన్ కెమెరాల యొక్క పని తీరును వివరించారు. సైబర్ నేరాలు, సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నంబర్ 1930, డయల్ 100ల ప్రాముఖ్యత గురించి తెలిపారు. కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ఫణీంద్ర, ఆర్ఐలు నాగేశ్వర్‌రావు, అచ్యుత్‌రావు, మెదక్ పట్టణ సీఐ వెంకట్, ఎస్ఐ పోచయ్యల, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా పోలీసుల విధి విధానాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు పోలీస్ స్టేషన్ నిర్వహణ తీరు, ఉద్యోగ విధులు, అత్యవసర పరిస్థితులలో వినియోగించే కమ్యూనికేషన్ విధానంపై ఎస్ఐ మధుసూదన్‌గౌడ్ వివరించారు. రిసెప్షన్ కౌంటర్ నుంచి మొదలుకొని కమ్యూనికేషన్ విధానంలో పోలీసులు ఒకరితో ఒకరు ఎలా సంభాషించుకుంటారు, ఫింగర్ ప్రింట్‌తో పాత నేరస్తుల నేరచరిత్రను తెలుసుకోవడం, సాంకేతికతను ఉపయోగించి కేసులను చేధించడం వంటి వాటిపై అవగాహన కల్పించారు. అదేవిధంగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు దారుడికి ఉన్న హక్కులపై కూడా వివరించారు. విద్యార్థులకు ఫిర్యాదుదారుడి హక్కులుపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

అయ్యప్ప దర్శనానికి వెళ్తూ...

మనోహరాబాద్(తూప్రాన్): మాల ధరించి అయ్యప్ప దర్శనానికి పాదయాత్రగా బయలుదేరిన ఒక యువకుడు అక్కడికి చేరకుండానే విగతజీవిగా మారాడు. దీంతో కూచారం గ్రామంలో విషాద చాయలు అలముకున్నాయి. స్థానికులు, గ్రామస్తుల వివరాల ప్రకారం.. మండలంలోని కూచారం గ్రామానికి చెందిన మజ్జతి శేఖర్, పుష్పమ్మలకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు శివప్రసాద్‌యాదవ్(26) తన తల్లి పుష్పమ్మను చూసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడు ఈ నెల 12న గ్రామానికి చెందిన మరో ఆరుగురితో కలిసి అయ్యప్ప మాలవేశాడు. వారంగా పాదయాత్ర ప్రారంభించారు. ఈ క్రమంలో వారు బుధవారం పుట్టపర్తి, కర్ణాటకలోని చిక్ బళ్ళాపూర్ సమీపంలోని పాలసముద్రం వద్దకు చేరుకున్నారు. వారిని ఉదయాన్నే గుర్తుతెలియని బైక్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో శివప్రసాద్, జ్ఞానేశ్వర్ గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం బెంగళూర్‌లోని ఆసుపత్రికి తరలించారు. శివప్రసాద్ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు.

గంజాయి అమ్ముతున్న వ్యక్తికి రిమాండ్



నిందితుడితో జిల్లా ఎక్సైజ్ అధికారి, సిబ్బంది

నర్సాపూర్: గంజాయి అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రోహిబిషన్ అధికారి రజాక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నరేందర్ బృందం గురువారం నర్సాపూర్ సంగారెడ్డి మార్గంలోని రాంచంద్రాపూర్ చౌరస్తా వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. గంజాయి అమ్మడానికి ప్రయత్నిస్తున్న సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన ప్రేమ్ కుమార్‌ను పరిశీలించగా అతడి వద్ద ఒక కిలో ఐదు గ్రాముల ఎండు గంజాయి దొరికింది. దానిని స్వాధీనం చేసుకుని అతడి నుంచి ఒక మొబైల్, బైక్, రూ.16,500 సీజ్ చేశామని చెప్పారు. ప్రేమ్‌కుమార్‌ను అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు రజాక్ వివరించారు.

క్లుప్తంగా

రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

రేగోడ్(మెదక్): రైతుబంధు నిధుల విడుదలను అడ్డుకునేలా ఈసీకి ఫిర్యాదు చేశారని ఆరోపిస్తూ పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను స్థానిక బీఆర్‌ఎస్ శ్రేణులు గురువారం దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చయ్య మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేక పార్టీ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు రవీందర్, పార్టీ ప్రధాన కార్యదర్శి సుంకె రమేశ్, సర్పంచ్‌లు నర్సింహులు, సిద్దారెడ్డి, ఎంపీటీసీ గొల్ల నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతో పథకాల పేరు చెప్పి..



మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

హవేళిఘణాపూర్(మెదక్): బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఓటమి భయంతో ప్రజలకు పథకాలపేరు చెప్పి పార్టీలో చేర్చుకోవడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ మండల నాయకులు శేరి మహేందర్‌రెడ్డి ఆరోపించారు. గురువారం కూచన్‌పల్లి గ్రామానికి చెందిన ఎరుకల కులస్తులు బుధవారం మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పథకాలు ఇస్తామని చెప్పి బలవంతంగా బీఆర్‌ఎస్ కండువాలు కప్పారని ఆయన ఆరోపించారు. ఎరుకల సంఘం తరఫున తమకు ఎలాంటి ఉపాధి లేదని ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా కూచన్‌పల్లిలో ఎరుకల వారు ఉన్న విషయం తన దృష్టికి రాలేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో కూచన్‌పల్లి ఎరుకల సంఘం సభ్యులు తదితరులు ఉన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి



భవన నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న నాయకులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): పంచాయతీ భవన నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సర్పంచ్ అశోక్‌గౌడ్ ఆదేశించారు. మండల పరిధిలోని అంతారం గ్రామంలో నిర్మించే పంచాయతీ భవనానికి వేస్తున్న స్లాబ్ కార్యక్రమాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే భవన నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవిశంకర్, వార్డు సభ్యులు ప్రకాశ్, చెన్నయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో యువత రాణించాలి



క్రీడాకారులతో ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి

మనోహరాబాద్(తూప్రాన్): క్రీడలలో యువత రాణించాలని మనోహరాబాద్ ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి సూచించారు. గురువారం మనోహరాబాద్‌లో జరుగుతున్న తెలంగాణ రాష్ట్ర సాఫ్ట్ బాల్ బాలికల జట్టు శిక్షణ క్యాంప్‌లో సీఐ రవి కుమార్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. వచ్చే నెల 4 నుంచి 8 వరకు జమ్మూ కశ్మీర్‌లో జరగనున్న జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలలో వారంతా పాల్గొంటారన్నారు. 25 నుంచి 31 వరకు ప్రాక్టీస్ చేయనున్నారని నిర్వాహకుడు అశోక్, ఉపాధ్యక్షుడు శోభన్‌బాబు తెలిపారు. అభిషేక్‌గౌడ్, గోవర్దన్, అజయ్, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, కోచ్‌లు పాల్గొన్నారు.

నేడు శివ్వంపేటకు కలెక్టర్, ఎస్పీ రాక

ఎన్నికల కోడ్‌పై అవగాహన సదస్సు

శివ్వంపేట(నర్సాపూర్): శివ్వంపేటలో ఎన్నికల నియమావళిపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్‌చారి తెలిపారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ రోహిణిప్రియదర్శిని హాజరుకానున్నారు. ఉదయం 10 గంటలకు శివ్వంపేటలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎన్నికల నియమావళి, సీ విజిల్ యాప్‌పై ఓటర్లకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓటర్లు, యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

◆ పాఠశాలలో అల్పాహారం ప్రారంభం

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ మున్సిపల్ పరిధిలో గల స్థానిక ప్రాథమిక పాఠశాలతో పాటు రోషిణి(ఉర్దూ)పాఠశాలలో గురువారం అల్పాహారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి బుచ్యానాయక్, మున్సిపల్ కమీషనర్ గోపాలకృష్ణ, మున్సిపల్, పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

◆ తరగతిగదిలో నాగుపాము కలకలం

కొల్చారం(నర్సాపూర్): పాఠశాల తరగతిగదిలో నాగుపాము కలకలం సృష్టించింది. స్థానిక ఉన్నత పాఠశాలలో గురువారం దసరా సెలవులు మునిగిపోవడంతో పాఠశాల పునః ప్రారంభం కావడంతో తరగతి గది తలుపులను తెరిచారు. లోపల ఆరడుగుల నాగపామును గమనించడంతో అప్రమత్తమైన ఉపాధ్యాయులు స్నేక్ క్యాచర్‌ను రప్పించగా, ఆయన పామును పట్టుకుని సమీప అటవీ ప్రాంతంలో వదిలేశాడు.

◆ బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కో ఆర్డినేటర్‌గా నవీన్

చిన్నశంకరంపేట(మెదక్): బీఆర్‌ఎస్ మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా మండలంలోని మడూర్ గ్రామానికి చెందిన పెండల నవీన్ నియామకం అయ్యారు. బీఆర్‌ఎస్ యూత్ ఆర్గనైజేషన్ సెక్రటరీ బాధ్యతలతో పాటు సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా నియమిస్తూ బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పట్లోరి రాజు గురువారం ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బండారు స్వామి, బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షుడు గోవర్దన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్, బీఆర్‌ఎస్ నియోజకవర్గ కార్యదర్శి లింగంరాజ్, సురేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. వెంకట్రావుపల్లిలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడు పట్లోరి రాజు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ గెలుపునకు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బండారు స్వామి, సర్పంచ్ లక్ష్మీపతి పాల్గొన్నారు.

◆ దళారుల చేతిలో రైతులు మోసపోవద్దు

వెల్దుర్తి(తూప్రాన్): దళారుల చేతిలో రైతులు మోసపోకుండా ఉండేందుకే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని, వాటిని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకట లక్ష్మమ్మ సూచించారు. మండలంలోని వెల్దుర్తి, ఉప్పులింగాపూర్, బండపోసాన్ పల్లి, శెట్టిపల్లి కలాన్ గ్రామాల్లో పీఏసీఎస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ సిద్దయ్య, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

◆ కోర్టు ఏర్పాటుకు భవనాల పరిశీలన

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గంలో మంజూరైన కోర్టు ఏర్పాటు కోసం ఆర్అండ్‌బీ అతిథిగృహం, బాలికల వసతి గృహాన్ని మెదక్ సివిల్‌కోర్టు జడ్జి లక్ష్మీశారద గురువారం పరిశీలించారు. తహసీల్దార్ సతీశ్, సీఐ జార్జి, ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తదితరులు ఆమె వెంట ఉన్నారు.

◆ పురాతన ఆలయ పరిశోధన

చేగుంట(తూప్రాన్): మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో పురాతన వేంకటేశ్వర ఆలయాన్ని పీహెచ్‌డీ విద్యార్థిని రమ్యశ్రీ గురువారం సందర్శించారు. గ్రామంలో ఉన్న ఆ ఆలయం సుమారు 250 సంవత్సరాల క్రితం నిర్మించినట్లు ఆధారాలు ఉన్నాయని ఆమె తెలిపారు. అతి పురాతన దేవాలయాల్లోని 36వ ఆలయంగా పరిశోధన చేస్తున్నట్లు తెలిపారు. దేవాలయాన్ని ఎలాంటి వాస్తును ఆచరించి నిర్మించారనే విషయంపై కూడా పరిశీలిస్తున్నట్లు రమ్యశ్రీ తెలిపారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు ధర్మకర్త కిషన్‌రావు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రాములు, పూజారి పురుషోత్తం, కనకరాజు తదితరులు ఉన్నారు.